# విభాత సంధ్యలు

— కె. బాలగోపాల్

[విభాత సంధ్యలు : తెలుగు సాహిత్యంలో సమాజం. సంపాదకులు సి. వి. సుబ్బారావు, సౌత్ ఇండియా పబ్లికేషన్, సి-10/1, కాకతీయనగర్, హైదరాబాద్. ధర 10 రూ॥]

సామాజిక శాస్త్రాన్నీ సాహిత్యాన్నీ ఒక దగ్గరకు తీసుకొస్తే ఏం జరుగుతుందనేది కుతూహలం రేకెత్తించే ప్రశ్నే. ఏవో కొత్త విషయాలు తెలియకపోవులే అనుకోవడం ఉదార స్వభావం కావచ్చు. అయితే ఇప్పటి వరకు చరిత్రలోని గొప్ప సాహితీవేత్త లెవ్వరూ సామాజిక (లేక ఇతర) శాస్త్రకారులు కాదు. (దాన్ని తిరగదిప్పిస్తే సామాజికశాస్త్రవేత్త లెవ్వరూ గొప్ప రచయితలు కాదు). కాబట్టి ఈ రెండింటినీ దగ్గరకు తేవలసిన అవసరం ఏమిటని ఆలోచనాత్ములకు అనుమానం వస్తుంది. ఆ అనుమానానికి కారకం నిజమయిన సందేహం కావచ్చు. కొత్త అంటే భయం కావచ్చు. మనకు అర్థంకాని విషయాలు ప్రపంచానికి అనవసరం అనుకునే మానసిక వార్ధక్యం కావచ్చు. దీనికి సమాధానం చెప్పే ప్రయత్నం సుబ్బారావు ముందుమాట.

తమకు సమాజాన్ని మొత్తంగా అధ్యయనం చేసే సామర్థ్యం గాని అవసరంగాని లేక దాన్ని ముక్కలు ముక్కలుగా విడగొట్టి ఒక్కొక్క ముక్కకూ ఒక్కొక్క అకడమిక్ శాఖను తయారుచేసుకున్నారు బూర్జువా సామాజిక శాస్త్రవేత్తలు. ఏమంటే ఇంకా చిన్నచిన్న ముక్కలు చేస్తామంటారు. పోను పోను ఇది అసంబద్ధమని అర్థమయి ఇప్పుడు నిర్మాణవాదం అనీ 'ఇంటర్ డిసిప్లినరీ' పద్ధతి అనీ ఈ ముక్కలను దగ్గరకు తెస్తున్నారు. ఎంత దగ్గరకు తెచ్చినా వాటిని విడగొట్టడంలోనే తప్పుంది. ఆ తప్పును సవరించుకుంటే సాహిత్యాన్ని గూడ ఒక అధ్యయన సాధనంగా సామాజిక శాస్త్రవేత్తలు గుర్తిస్తారని సుబ్బారావు అభిప్రాయం. అంతే కాదు, ఆ తప్పును సవరించుకోవడానికి సాహిత్య అధ్యయనం ఉపయోగ పడుతుందేమో. సాహిత్యానికి — ముఖ్యంగా కథాసాహిత్యానికి — మానవ సంబంధాలు ప్రత్యక్ష వస్తువు. మానవ సంబంధాలు సామాజిక సంబంధాల సజీవ రూపాంతరీకరణ. వాటిని వాటి మూలాల ప్రాతిపదిక మీద విడగొట్టడం సాధ్యం కాదు. పైగా

సాహిత్యం సమాజాన్ని విశ్లేషించడం ద్వారా అర్థం చేసుకోదు, సృజనాత్మకంగా ప్రతిఫలించడం ద్వారా అర్థం చేసుకుంటుంది. అంతవరకు అదృష్టం. ఎందుకంటే ప్రతిఫలనం (సృజనాత్మకం అయినా కాకున్నా, ప్రతిభావంతం అయినా కాకున్నా) కనీసం విషయాన్ని ముక్కలు ముక్కలు చేయదు. తన దృష్టి పరిధిలో ఒక మొత్తంగానే చూస్తుంది. ఈ కారణంగా సాహిత్య అధ్యయనం సామాజిక శాస్త్రవేత్తలకు తమ పరిశోధనలో కోల్పోయిన సమగ్రతను కల్పించగలదు.

సామాజిక శాస్త్రిలకు ఈ ప్రయోజనం ఉంటే సాహిత్యానికి కాకున్నా సాహిత్య విమర్శకు ఇంతకంటె గాఢమయిన ప్రయోజనాన్ని సుబ్బారావు సూచిస్తాడు. సాంప్రదాయిక సాహిత్య విమర్శ సాహిత్యం యొక్క రూప సంబంధమయిన విషయాలకుగానీ సమాజంయొక్క ఉపరితల సంబంధమయిన విషయాలకు గాని పరిమితమయి వుంది. రకరకాల విమర్శనా పద్ధతులుగా చలామణి అవుతున్నవన్నీ అంతిమంగా ఈ కోవకు చెందినవే. శాస్త్రీయమయిన (మార్క్సిస్టు) సాహిత్య విమర్శ సాహిత్యాన్ని సమాజంలో అంతర్భాగంగా, సమాజం నుండి సామాజిక గమనంనుండి పుట్టిన సామాజిక చైతన్య రూపంగా, అర్థం చేసుకుంటుంది. కాబట్టి మార్క్సిస్టు సాహిత్య విమర్శకు సామాజిక అధ్యయనం చాలా ముఖ్యమవుతుంది. సాహిత్యాన్ని సామాజిక శాస్త్ర దృక్పథంతో పరిశీలించడం అందుకు దోహదం జేస్తుంది. ఈ దృష్టితో 'సాహిత్యంతో సమాజాన్ని' పరిశీలించడం ఈ సంకలనంలోని వ్యాసాల ఉద్దేశ్యం - బహుశా వ్యాసాల ఉద్దేశ్యం అనేకంటే సంకలనం ఉద్దేశ్యం అనాలేమో. ఎందుకంటే సంపాదకుడి ముందుమాటకూ సంకలనంలోని వ్యాసాలకూ ఉండగలిగినంత పొంతన లేదు.

ఇది సాహిత్య విమర్శ కాదనీ సాహిత్యంతో సమాజాన్ని దర్శించే ప్రయత్నం మాత్రమే ననీ ముందుమాటే చెబుతుంది. కాబట్టి ఆ ప్రాతిపదికమీద సమీక్షించడంలో అర్థం వుండదు. అయితే సాహిత్యంలో దర్శించాలని ఆశించిన 'సమాజం' వారివారి ప్రత్యేక అకాడమిక్ విభాగాల అధ్యయన విషయాలు మాత్రమేనా లేక సమగ్ర సామాజిక వ్యవస్థా అని అడిగితే సమీక్షకుడి పైన భారం పెరుగుతుంది. ఇంకొక్కడుగు ముందుకుపోయి కథాసాహిత్యానికి మూలవస్తువయిన మానవ సంబంధాల సామాజిక విశ్లేషణను సాహిత్యంలో చూడదల్చుకున్నారా అని అడిగితే భారం మరింత అవుతుంది.

సంకలనంలోని వ్యాసాలన్నింటిలోనికీ (ఆర్. ఎస్. రావుగారి ప్రసంగాన్ని పక్కన పెడితే) సంకలనం ఉద్దేశ్యానికి బాగా న్యాయం చేకూర్చింది నరసింహారెడ్డిగారి వ్యాసం. అయితే కేశవరెడ్డి నవలలలో 'రాయలసీమ గ్రామీణ జీవిత సంఘర్షణ'ను దర్శించడంలో దర్శింపజేయడంలో నరసింహారెడ్డిగారు సాధించిన విజయం సంపాదకుడు ప్రకటించిన లక్ష్యానికి కొంతవరకు అపజయం. ఎందుకంటే ఆయన ఆ దర్శనాన్ని సాధించింది ఆర్థిక శాస్త్రవేత్తగా తనకున్న సిద్ధాంత పరిజ్ఞానంతో కాదు, చిత్తూరు జిల్లా వాస్తవ్యుడిగా తనకున్న జీవిత పరిజ్ఞానంతో. ఆయన ఎకనామిక్స్ ప్రొఫెసర్ కాకున్నా ఆ వ్యాసం రాసిఉండేవారేనేమో. సామాజిక శాస్త్రవేత్తలగా తక్కినవాళ్ళు రాసిన వ్యాసాలు ఈ వ్యాసమంత సంతృప్తికరంగా లేవు. దీనిని బట్టి ఎంతటి మార్క్సిస్టుల కయినా శాస్త్రపరిజ్ఞానం కంటే జీవిత అనుభవమే ఎక్కువ విజ్ఞానదాయకం అని నిర్ధారిస్తే సంకలనం సంపాదకుడు గాని, వ్యాసాల రచయితలు గాని అభ్యంతరం చెప్పరేమో, కాని అట్లాగయితే ఎవరి జీవిత అనుభవం వారిదే అయిపోతుండ సమిష్టి జీవిత అనుభవాన్ని అధ్యయనం చేసే విజ్ఞానశాస్త్ర పరిజ్ఞానానికి సామాజిక అధ్యయనంలో వున్నస్థానం ఏమిటి అన్న ప్రశ్న పచ్చివెలక్కాయలాగ సంకటంగా మిగిలిపోతుంది.

ఆర్. ఎస్. రావుగారు 'కన్యాశుల్కం' మీద హైదరాబాద్‌లో చేసిన ప్రసంగాన్ని ఆనాడు విన్నవాళ్ళు ఉత్తేజితులయ్యారు (నేను వినలేదు). దాన్నిబట్టి ఈ సంకలనంలో వ్యాసరూపంలో యిచ్చిన సంగ్రహంకంటే చాలా ఎక్కువ విషయాలే ఆయన ఆనాడు చెప్పివుంటారని భావించాలి. 'కన్యాశుల్కం'ను చారిత్రకంగా అర్థం చేసుకోవడానికి అవసరమయిన చట్రాన్ని రేఖామాత్రంగా ఈ వ్యాసంలో యిచ్చారు. తళుక్కుమనే రెండు నక్షత్రాలను చూపించి మొత్తం అమావాస్య ఆకాశాన్ని ఊహించుకోమన్నారు. Brevity is the soul of wit కావచ్చుగాని సాహిత్యం వంటి మానవీయ ప్రక్రియ వట్టి ప్రేతాత్మతో సంతృప్తి చెందదు, దానికి రక్తమాంసాల పుష్టి కావాలి.

ఆర్. ఎస్. రావుగారి విశ్లేషణ పరిధిలోనే కొన్ని ప్రశ్నలు వస్తాయి. సంఘ సంస్కరణల 'హవా' ఇంకా నడుస్తున్న రోజులలో గురజాడ 'కన్యాశుల్కం' రాసాడు. అయితే గురజాడ నాటకంలో నిజమయిన సంస్కర్తలు లేరు. ఒక వీరేశలింగంగానీ, రాంమోహన్‌రాయ్‌గాని లేరు. సౌజన్యారావు పంతులు సమకాలీన సంస్క

ర్తలకు ఎంతమాత్రం ప్రతినిధి కాదు. గిరీశం వాళ్ళకు అపహాస్యరూపం మాత్రమే. వీళ్ళిద్దరూ కొత్త మధ్యతరగతి రెండు అంచులకు ప్రతినిధులంటే సందేహమే. గిరీశం ఏమోగాని కొత్త మధ్యతరగతిలోని 'మంచి' సౌజన్యారావు పంతులంత అమాయక మయినదీ కాదు, అంత నిరర్థకమయినదీ కాదు. తన అవసరాలను బాగానే సాధించు కుంది. నిజానికి గురజాడ పాతను ఎంతగా వేళాకోళం చేసాడో కొత్తనూ అంతగా వేళాకోళం చేసాడు. రెంటినీ వేళాకోళం చేయడానికి గురజాడ మధురవాణిని ఎంచు కున్నాడని ఆర్. ఎస్. రావుగారు గుర్తించారు. అయితే ఈ ఎంపిక వెనుకనున్నది పెడసరితనమే గాని (ఇంగ్లీషులో cussedness అనీ contrariness అనీ అంటారు) మధురవాణి తిరుగుబాటుకుగాని అభ్యుదయకర మార్పుకుగాని సూచిక కాదని నా అనుమానం. ఈ పెడసరితనానికి గల కారణాన్ని జమీందారీలలో పుట్టిన కొత్త మేధావి వర్గం స్వభావం నుండి అర్థం చేసుకోవాలేమో. పాతకూ కొత్తకూ మూడవ ప్రత్యామ్నాయాన్ని మధురవాణి రూపంలో చూపడం గురజాడ సంకల్పం కాదు. అసంకల్పితంగా అపని చేయడానికి కావలసిన సామాజిక పరిస్థితులు ఆనాడు లేవు. మొత్తానికి, ఇంకా చాలా చెప్పగలరని ఊరించి వదిలేసారు ఆర్. ఎస్. రావుగారు.

వర్తమాన అవసరాలే గతానికి అర్థం చేకూరుస్తాయని సుబ్బారావు చివరి వ్యాసంలో అన్న వాక్యాలకు హరగోపాల్‌గారి వ్యాసం (కొ. కు. 'చదువు' నవల - మారీమారని విద్యా విధానం) నిదర్శనం. రాజీవ్‌గాంధీ నూతన విద్యావిధానం ముసా యిదాను దేశంమీద వదిలిన తరువాత దాని గురించి చాలా తీవ్రంగా స్పందించి, ఆలోచించి, ఆలోచింప చేసిన వార్లలో హరగోపాల్‌గారు ఒకరు. ఆ క్రమంలోనే ఆయనకు కుటుంబరావు నవల మీద దృష్టి పునఃప్రసరించినట్టుంది. రాజీవ్‌గాంధీ ఆ పుణ్యం కట్టుకోకపోతే ఈ వ్యాసం రాయాలన్న ఆలోచన హరగోపాల్ గారికి వచ్చేది కాదేమో. కుటుంబరావు చిన్నతనం నాటికీ ఈనాటికీ విద్యకుండే స్వభావంగానీ బోధనా పద్ధతులుగానీ శిక్షణ పేరిట అమలుచేసే శిక్షగానీ గుణాత్మకంగా మారలేదని 'చదువు' నవల ద్వారా హరగోపాల్‌గారు చూపించారు. ఇప్పుడు రాబోతున్న తేడా ఏమిటంటే కుటుంబరావు రోజుల్లో గుమస్తాలను తయారుచేసిన విద్యావిధానం ఇప్పుడు కంప్యూటర్ గుమాస్తాలను తయారుచేయబోతుంది. ఇకమీదట సుందరం ఇంగ్లీషులో మాట్లాడతాడు. తన అమాయకత్వాన్ని గూడ కోల్పోతాడు. మానవతా విలువలకూ బడిలోని వాతావరణానికీ మధ్యనున్న వైరుధ్యం అతన్ని బాధపెట్టదు. దాన్ని

గుర్తించడంఅంటూ జరిగితే చాలా ఫ్యాషనబుల్‌గా 'హ్యూమన్ కండిషన్' అనుకొని అస్తిత్వవాది అవుతాడు.

సామాజిక శాస్త్రవేత్తలనేకాక, సమాజాన్ని గురించి నాకు తెలుసుననుకునే వాళ్ళందరినీ రావి శాస్త్రి రచనలు బాగా ఆకర్షిస్తాయి. ఆయన కథలు సమాజం మీద ఎడతెరిపిలేని కామెంటరీ.

అవి ఒక క్షణంగూడ ఆగి అంతఃకరణలోకి తొంగి చూసుకోవు. కాబట్టి ఒకరకంగా శివలింగ ప్రసాద్‌గారి కర్తవ్యం (రావి శాస్త్రి రచనలు – ప్రభుత్వ యంత్రాంగం రూపం, స్వభావం) సులువయినదే. అయితే రావిశాస్త్రి రచనల్లో గోచరించే రాజ్యాంగ యంత్రాన్ని ఎత్తిచూపడం బదులు రాజ్యాంగ యంత్రంలోని వివిధ అంగాలు లేక అంశాలు ('ప్రభుత్వ ఉద్యోగుల స్వభావం, ప్రభుత్వ సంస్కరణలు, సంక్షేమ పథకాలు, అవినీతి') రావి శాస్త్రి కథల్లో ఏవిధంగా ప్రతిఫలించాయో సరిసమానంగా చూపే ప్రయత్నం చేయడం వల్ల ఆయన రచనలకు స్వతసిద్ధంగా లేని సమతుల్యం అంటగట్టడం అయిందేమోనని నా అనుమానం. పాలకులు ఉపయోగించే చతుర్విధ ఉపాయాలలో రావి శాస్త్రికి 'దండం' కనబడినంతగా వేరే ఏదీ కనబడలేదు. సామాజిక వ్యాఖ్యలుగా ఆయన రచనల బలం అయినా బలహీనత అయినా అదే. అందుకే ప్రభుత్వం అనే పదార్థాన్ని ఆవరించిన 'మాయ'ను తొలగించడానికి రావిశాస్త్రి చేసిన ప్రయత్నం 'అపూర్వమే' అయినా అసమగ్రం కాక తప్పలేదేమో. (అయితే రచయిత ఏం రాసాడో చర్చించాలి గాని ఏం రాయలేదో చర్చించడంలో అర్థం లేదన్న వాదనకు నా దగ్గర సంతృప్తికరమయిన సమాధానం లేదు కాబట్టి ఈ చివరి వాక్యాన్ని ఉపసంహరించుకోవడానికి నేను సిద్ధమే).

సాహిత్యంలో సమాజాన్ని దర్శిస్తే, ఆ సమాజంలో అంతర్భాగమయిన సాహిత్యం తిరిగి ఆ దర్శనంలో కనబడాలి. ఒక అద్దంలో ఇంకొక అద్దాన్ని చూస్తే మొదటి అద్దం మళ్ళీ కనబడ్డట్టు. ఈ దృష్టితో చూస్తే సంకలనంలో అన్నిటికంటె అసంతృప్తికరమయిన వ్యాసం నిరంజనరావుగారి 'యజ్ఞం : తూర్పు కోస్తాలో వ్యవసాయ సంబంధాలు' - శ్రీకాకుళం ప్రాంతపు వ్యవసాయ సంబంధాలలో వ్యాపారీకరణ వల్ల వచ్చిన మార్పును నిరంజనరావుగారు చక్కగా వివరించారు. ఈ సందర్భంలో ఆయన చేసిన అన్ని సూత్రీకరణలతోనూ అంగీకరించడం కష్టం. ఒక గ్రామంలోని వ్యవసాయ సంబంధాలను విడిగా విశ్లేషించి దాన్ని 'భూస్వామ్యం' లేక

'రైతుస్వామ్యం' అని విభజించడంలో అర్థం లేదు. భూస్వామ్య సమాజంలో ప్రతివాళ్ళూనూ భూస్వాము లుండరు — కేవలం రైతులే వున్న గ్రామాలు ఎన్నో వుంటాయి. అదెలాగున్నా, వ్యవసాయం యొక్క క్రమానుగత వ్యాపారీకరణ 'యజ్ఞం' కథకు నేపథ్యం అన్న విషయాన్ని వివరంగా విశదీకరించారు. అయితే 'యజ్ఞం'లో ఇంకా చూడడానికి చాలా సమాజం వుంది. గ్రామ పెత్తందారీ వ్యవస్థ వుంది, గాంధియన్ గ్రామీణ రాజకీయం వుంది. (శ్రీరాములు నాయుడును నెహ్రూతో పోల్చడం చాలా వివాదాస్పదమయిన స్వామ్యం). అన్యాయంపట్ల నిరసన వుంది నిరసనను ప్రత్యక్ష అనుభవం నుండి సాధారణీకరించడంలో విఫలమయిన అశక్తత వుంది. సామాజిక శాస్త్రాల అకడమిక్ శ్రమ విభజనను జయించడానికి సాహిత్య పరిశీలన ఒక సాధనం అని రచనకు ఉద్యుక్తులయిన సామాజిక శాస్త్ర వేత్తలు, సాహిత్య పరిశీలనను ఆ శ్రమవిభజనకు లోబడి చేయడం తమ లక్ష్యానికే అన్యాయం. అయితే ఆ లక్ష్యం కేవలం సంకలనకర్త అయిన సంపాదకుడిదే అయితే తప్పు అందరిమీదా పెట్టలేం.

ఇక మిగిలింది మొదటి వ్యాసం, చివరి వ్యాసం. రామకృష్ణగారి వ్యాసం వీరేశలింగం రచనలమీద ఒక స్థూల పరిశీలన. అంత స్థూలమయిన పరిశీలనను పరిశీలించడం కష్టం. సంపాదకుడు స్వయంగా రాసిన చివరి వ్యాసంగూడ సంకలనానికి ప్రకటించుకున్న లక్ష్యానికి భిన్నమయిన ఉద్దేశ్యంతో రాసినదే. 'కొమురం భీం' నవల రాసిన పద్ధతిని విశ్లేషించడం ద్వారా చరిత్ర రచన గురించి కొన్ని అభిప్రాయాలను నిర్ధారించే ప్రయత్నం చేసారు. విజేతలు రాసిన చరిత్రనుండి, కల్పించిన ఆధారాల నుండి, నిజమయిన చరిత్రను నిర్ధారించడం ఎట్లాగనేది క్లిష్టమయిన సమస్య. నిన్న మొన్నటి చరిత్ర అయితే అందులో పాల్గొన్న ప్రజల జ్ఞాపకాలు ఉపకరిస్తాయి. అయితే అదిగూడ అనుకున్నంత సులభం కాకపోవచ్చు. 'ప్రజలే చరిత్ర నిర్మాతలు' అన్నప్పుడు సంఘటన, సంకల్పం ధ్వనిస్తాయి. అయితే ఆ వాక్యాన్ని 'రాజులు చరిత్ర నిర్మాతలు' అనే అభిప్రాయానికి అభావంగా అర్థం చేసుకున్నంత మేరకే అది వాస్తవం. సామాజిక మానవుడు తన నిత్య జీవిత సమస్యలను పరిష్కరించుకొని ఆ జీవిత అనుభవం నుండి పుట్టిన ఆశయాలను సాధించుకునే క్రమంలో చరిత్రను నిర్మిస్తాడు. సాధారణంగా అసంకల్పితంగానే నిర్మిస్తాడు. అరుదుగా మాత్రమే సంకల్ప పూర్వకంగా నిర్మిస్తాడు. కాబట్టి తత్సంబంధమయిన జ్ఞాపకాలలో మార్మికత,

క్రమలు, నూతన వ్యాఖ్యానాలు, స్థల కాల పరిమితులు, ఎప్పుడూ వుంటాయి. పాల కుల చరిత్ర నుండి నిజమయిన చరిత్రను 'ఫిల్టర్' చేయడం ఎంత కష్టమో ప్రజల జ్ఞాపకాలనుండి వాస్తవాలను రాబట్టడం గూడ ఒక్కొక్కసారి అంతే కష్టం కావచ్చు. వర్తమాన పోరాటాల గురించి అందులో పాల్గొంటున్న ప్రజల నుండి తెలుసుకునే ప్రయత్నం చేస్తే ఈ విషయం అర్థం అవుతుంది. ఇక్కడిదాకా వచ్చేసరికి చరిత్ర అంటే ఏమిటి అనే ప్రశ్నకు సమాధానం ఎంతమాత్రం సులువయినది కాదని అర్థం అవుతుంది. వర్తమాన అవసరాలే గతానికి అర్థాన్ని చేకూరుస్తాయి కాబట్టి గతంలో జరిగిన 'అన్ని విషయాలూ జరిగింది జరిగినట్టు' తెలుసుకునే అర్థరహిత మయిన ప్రయత్నం చేయకుండ, వర్తమాన అవసరాలకు ఉత్తేజాన్ని ఇచ్చే వ్యాఖ్యానాన్ని మాత్రమే చరిత్రగా భావించాలని ఎవరయినా అనవచ్చును. దీనికి తర్కంలో సమా ధానం లేదు. అప్పుడు చరిత్ర 'శాస్త్రం' కావడం మానేసి సామాజిక సంఘర్షణలో భాగం అవుతుంది. అన్ని సామాజిక శాస్త్రాలకూ అంతిమంగా ఇదేగతి పట్టక తప్పదుగాని చరిత్రకు ముందు పడుతుందేమో. అందుకే విశ్వవిద్యాలయాలలో మార్క్సిస్టు ప్రొఫెసర్లుండడం (సుప్రీంకోర్టులో మార్క్సిస్టు జడ్జీలలాగ) అసంగత మయిన విషయం అనిపిస్తుంది.

సమీక్షను ఇక్కడితో ముగించవచ్చును గాని, తెలుగులో మార్క్సిస్టు సాహిత్య విమర్శ బాగా అభివృద్ధి చెందలేదన్న సంపాదకుడి ఆవేదనను పట్టించుకో కుండ వదిలేయడం అన్యాయం అవుతుంది. మార్క్సిస్టులు సాహిత్యాన్ని రాజకీయ, సామాజిక, ఆర్థిక, చారిత్రక దృక్పథాలతో చూస్తున్నారు తప్ప మార్క్సిస్టు సాహిత్య విమర్శ తనవయిన ప్రమాణాలనూ విమర్శనా సాధనాలనూ రూపొందించుకోవడంలో సాఫల్యం చెందలేదు. రాజకీయ విమర్శ కాక 'సాహిత్యాన్ని సాహిత్యంగా' విమ ర్శించే ప్రయత్నం చేసినవాళ్ళు లేకపోలేదు గాని వాళ్ళు ఆ ఆరాటంలో మార్క్సి జానికే తిలోదకాలిస్తున్నారు. నాకు తెలిసినంతవరకు, నిజమయిన మార్క్సిస్టు సాహిత్య విమర్శనా పద్ధతులను రూపొందించడానికి సిద్ధాంతస్థాయిలో చెప్పుకోదగ్గ ప్రయత్నం చేస్తున్నది త్రిపురనేని మధుసూదనరావు ఒక్కరే. ఆయన వెల్చేరు నారాయణరావు పుస్తకం మీద, కవిసేన మానిఫెస్టోమీద, రాసిన సమీక్ష . చిత్తూరు సెషన్స్‌కోర్టులో చదివిన స్టేట్ మెంట్, 'గతితార్కిక సాహిత్య భౌతిక వాదం' అనే

⟶

# విరసం విశేషాలు

## హైదరాబాద్

● మే డే శతాబ్ది సందర్భంగా విరసం సిటీ యూనిట్ మే 18 న సెమినార్ నిర్వహించింది. యూనిట్ కన్వీనర్ అధ్యక్షత వహించారు. ఇఫ్టూనాయకుడు కా. పి. కె. మూర్తి భారత కార్మిక వర్గ చరిత్ర అనే అంశంపై ప్రసంగించారు. ఆయన భారత కార్మికవర్గ పరిణామ క్రమాన్ని, స్వభావాన్ని, కార్మికులకు భూమితోగల సంబంధాన్ని వివరించి బూర్జువా, రివిజనిష్టు ట్రేడ్‌యూనియన్ల ఆర్థిక వాదం నిర్వహిస్తున్న విద్రోహకర పాత్రను స్పష్టంచేశారు.

● ఫ్రెంచి విద్యార్థుల తిరుగుబాటుపై యూనిట్ నిర్వహించిన తరగతిలో ఆ తిరుగుబాటులో స్వయంగా పాల్గొన్న కా. పి.కె. మూర్తి ప్రసంగించారు. తిరుగుబాటు క్రమాల్ని, ఆనాటి ఫ్రెంచి ప్రభుత్వపు నిర్బంధాన్ని, ఫ్రెంచి సాహిత్యంపై తిరుగుబాటు చూపించిన ప్రభావాన్నీ, ఆ తిరుగుబాటులో ఫ్రెంచి రచయితల పాత్రని ఆయన వివరించారు.

● కా. శ్రీ. శ్రీ. సంస్మరణసభ 15-6-86 న జరిగింది. కా. సుధాకరణ్ అధ్యక్షత వహించిన ఈ సభలో కా. కాశోజీ, శివారెడ్డి, యం. టి. ఖాన్‌లు ప్రసంగించారు.

---

శీర్షికతో రాసిన సిద్ధాంత వ్యాసం, దాన్ని ప్రాచీన సాహిత్యానికి అన్వయించడానికి చేసిన ప్రయత్నాలు, చెప్పుకోదగ్గ ప్రయోగాలు. ఇవేవీ ఈ సంకలనం యొక్క 'ఉపయుక్త గ్రంథాల' లిస్టులో లేకపోవడం విచారించాల్సిన విషయం. సాహిత్య షమర్శ గురించి మధుసూదనరావుగారు చేసిన సిద్ధాంతాలనూ వాటి నిర్దిష్ట అన్వయాన్నీ ఏ కారణం చేతనో చర్చించటం జరగడం లేదు. 'ఈ మాటలు లెనిన్ చెప్పాడా, మార్క్స్ చెప్పలేదా' అనే స్థాయిలో కాక విమర్శనాత్మకంగా వాటిని చర్చిస్తే మార్క్సిస్టు సాహిత్య విమర్శకు శాస్త్రీయమయిన ప్రాతిపదిక (వట్టి ప్రాతిపదిక మాత్రమే కావచ్చు) ఏర్పడుతుందని నా ఆశ.